

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు

కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ వద్ద ఈనెల 15వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను కడప తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. -8లో



సిబ్బంది కొరత.. వాహనదారులకు వెత

కడపలోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో వాహనదారులకు సేవలు కాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. -8లో

వాతావరణం

గరిష్టం/కనిష్టం
41.0/27.3

జిల్లాలో మంగళవారం 27.3 – 41.0 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 2.5 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.
- కడప అగ్రికల్చర్

న్యూస్‌రీల్

8న జెడ్పీ సమావేశం

కడప కోటిరెడ్డిసర్కిల్: జిల్లా ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం మే 8వ తేది ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 వరకు నిర్వహించనున్నట్లు జెడ్పీ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఓబులమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని జెడ్పీటీసీ సభ్యులు, వైఎస్సార్, అన్నమయ్య జిల్లా అధికారులు సమావేశానికి హాజరు కావాల్సి ఉంటుందని తెలిపారు.

25న టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సమావేశం

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని సీఎస్ఐ ఉన్నత పాఠశాలలో ఈ నెల 25వ తేదీ ఉదయం 9 గంటలకు కడప జిల్లా టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు టీచర్స్ హౌస్ బిల్డింగ్ సొసైటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చల్లా విశ్వనాథరెడ్డి, బాల శౌరిరెడ్డి తెలిపారు. సొసైటీ సభ్యులందరూ సమావేశానికి హాజరుకావాలని కోరారు.

నేడు మంత్రి కొండపల్లి రాక


కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఈ నెల 23, 24 తేదీల్లో జిల్లాలో పర్యటించనున్నట్లు ఇన్‌ఛార్జి డీఆర్వో వెంకటపతి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. 23వ రాత్రి కడప ఆర్అండ్‌బీగెస్ట్‌కు చేరుకుని బస చేస్తారని పేర్కొన్నారు. 24న ఉదయం కొప్పర్తి ఇండస్ట్రియల్ ఎస్టేట్ ను సందర్శనని, ఆపై కలెక్టర్ తో కలసి ఎంఎస్ఎంఈపై సమీక్షా సమావేశంలో పాల్గొంటారు. తిరిగి మధ్యాహ్నం 1.30 గంటల నుండి 3 గంటల వరకు సెర్ప్ కార్యక్రమాలపై జరిగే సమీక్షా సమావేశంలో పాల్గొంటారని వివరించారు.

మెడికల్ అండ్ హెల్త్ డీడీగా శేఖర్



కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 డిప్యూటీ డైరెక్టర్‌గా వై.శేఖర్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కడప సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి అసిస్టెంట్ డైరెక్టర్‌గా ఉన్న ఈయన..వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం డీడీగా అదనపు బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న భక్తవత్సలం ఏపీ రిక్రూట్‌మెంట్ బోర్డ్ జాయింట్ డైరెక్టర్‌గా పదోన్నతిపై వెళ్లారు.

మైలవరానికి నీరు విడుదల



గండికోట ప్రాజెక్టు నుంచి నీటిని విడుదల చేసిన దృశ్యం

కొండాపురం: గండికోట జలాశయం నుంచి రెండు గేట్లు ఎత్తి వేల క్యూసెక్కుల నీటిని మైలవరం జలాశయానికి విడుదల చేసినట్లు జీఎన్ ఎస్ఎస్ ఈఈ ఉమామహేశ్వర్లు మంగళవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైలవరం జలాశయం పరిధిలోని గ్రామాల ప్రజలకు సాగు, తాగునీటి అవసరాల కోసం ఒక టీఎంసీ నీటిని గండికోట ప్రాజెక్టు నుంచి తరలిస్తున్నామని వివరించారు.

సివిల్ పవర్

UPSC

మనసు మూలన ఓ ‘లక్ష్యం’ చేరింది..
మనిషిలో ‘నిర్లక్ష్యం’ దూరమైంది..
‘తొలి’ అడుగులు తడబడ్డాయి..
మలి అడుగులు విజయానికి
దగ్గరగా వచ్చి ఆగిపోయాయి..
పట్టుదల పంతం రెట్టింపైంది..
వారి కృషికి.. చిత్తశుద్ధి తోడైంది...
ఆకాశమంత లక్ష్యం చిన్నబోయింది..
విజయం ఒళ్లోకొచ్చి వాలింది.. అవును..
‘యూపీఎస్సీ’ ఫలితాల్లో మనోళ్లు మెరిశారు..
‘సివిల్’ సంద్రాన్ని దాటి.. విజయ తీరాలకు
చేరారు..ముగ్గురు విజేతలై జిల్లా ఖ్యాతిని
ఇనుమడించారు. –సాక్షి ప్రతినిధి, కడప

- సివిల్స్‌కు ఎంపికైన ముగ్గురు జిల్లావాసులు
- పట్టుదలతో చదివి కలెక్టర్ కల సాకారం



చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి @ 119



చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి



కుటుంబ సభ్యులతో శివగణేష్‌రెడ్డి

కడప మండలం ఆలంఖాన్‌పల్లెకు చెందిన చెన్నంరెడ్డి మల్లికార్జునరెడ్డి, ఇందిరా ప్రియదర్శిని కుమారుడు చెన్నంరెడ్డి శివగణేష్ రెడ్డి సివిల్స్ ఫలితాల్లో ఆల్ ఇండియాస్థాయిలో 119వ ర్యాంకు సాధించారు. తల్లిదండ్రుల కలను నెరవేర్చడంతో పాటు ఊరి పేరును నిలబెట్టాడు. శివగణేష్‌రెడ్డి 1 నుంచి 10వ తరగతి వరకు కడప బాలవికాస్ హైస్కూల్లో చదివాడు. ఇంటర్మీడియట్‌ను నెల్లూరు నరసింహకొండ నారాయణ కళాశాలలో పూర్తి చేశాడు. తరువాత బీటెక్ హైదరాబాదు ఐఐటీలో పూర్తి చేశారు. తరువాత సివిల్స్ కోచింగ్‌ను ఢిల్లీలో తీసుకున్నాడు.

- తొలిసారి సివిల్స్ రాసినప్పుడు ర్యాంకు రాలేదు. రెండవసారి ఇంటర్వ్యూ వరకు వెళ్లి రెండు మార్కులతో వెనుదిరిగాడు. పట్టు వదలని విక్రమార్కుడిలా మూడవ సారి మరింత గట్టిగా ప్రయత్నించి 119వ ర్యాంకు సాధించాడు. చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి తండ్రి మల్లికార్జునరెడ్డి గతంలో కడప నగర శివార్లలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో లెక్చరర్‌గా పనిచేస్తూ ఉండేవారు. తరువాత ఉద్యోగాన్ని మానేసి వ్యవసాయం చేస్తూ పిల్లలను చదివించుకునేవాడు. శివగణేష్‌రెడ్డి చెల్లెలు శివజ్యోతిక బీటెక్ పూర్తి చేసి ఎంటెక్ చేసేందుకు ప్రిపేర్ అవుతోంది. శివగణేష్‌రెడ్డి సివిల్స్‌లో 119 ర్యాంకు సాధించడంపై తల్లితండ్రులు సంతోషం వ్యక్తం చేశారు.
- కడప బాలవికాస్ హైస్కూల్ పూర్వపు విద్యార్థి అయిన చెన్నంరెడ్డి శివగణేష్‌రెడ్డి 119వ ర్యాంకు సాధించడంపై పాఠశాల డైరెక్టర్ గంగయ్య, కరస్పాండెంట్ సుబ్బరాయుడు ఆనందం వ్యక్తం చేశారు.

ధనుష్ @ 232



పూల ధనుష్

కడప ఎడ్యుకేషన్: కడప నాగరాజుపేటకు చెందిన పూల శ్రీనివాసులు, నాగమణి కుమారుడు పూల ధనుష్ సివిల్స్ ఫలితాల్లో 232వ ర్యాంకు సాధించాడు. ఈయన ప్రస్తుతం ఐడీఏఎస్(డిఫెన్స్) సర్వీసెస్‌లో సిమ్లాలో ప్రొబేషనరీ ఆఫీసర్‌గా శిక్షణలో ఉన్నాడు. వీరి తల్లిదండ్రులు ఉద్యోగరీత్యా హైదరాబాదులో స్థిరపడ్డారు. పూల ధనుష్ విద్యాభ్యాసమంతా హైదరాబాదులోనే పూర్తయింది. తరువాత సివిల్స్‌కు ఢిల్లీలో కోచింగ్ తీసుకుని నాలుగో ప్రయత్నంలో 232వ ర్యాంకు సాధించాడు.

నేలటూరు శ్రీకాంత్ రెడ్డి @ 151



శ్రీకాంత్ రెడ్డి



శ్రీకాంత్‌రెడ్డి తల్లిదండ్రులు సుబ్బారెడ్డి, సావిత్రి

నేలటూరు శ్రీకాంత్‌రెడ్డికి చిన్నప్పటి నుంచి చదువంటే మక్కువ. తల్లిదండ్రుల కష్టానికి తగ్గట్లు పట్టుదలగా చదువులో రాణించాడు. సాధారణ కుటుంబం నుంచి సివిల్స్ పరీక్షలో 151వ ర్యాంకు సాధించి శభాష్ అనిపించాడు. తొలి, మలి ప్రయత్నాల్లోనే మెయిన్స్, ఇంటర్వ్యూ వరకూ వెళ్లిన ఆయన మూడో ప్రయత్నంలో సివిల్స్ సాధించారు. చెన్నూరుకు చెందిన నేలటూరు సుబ్బారెడ్డి, సావిత్రి దంపతులకు శ్రీకాంత్‌రెడ్డి, శ్రీలత సంతానం. శ్రీకాంత్‌రెడ్డి పదో తరగతి వరకూ కడప నాగార్జున హైస్కూల్‌లో చదివారు. ఇంటర్మీడియట్ నెల్లూరు లోని నరసింహకొండ వద్ద ఉన్న నారాయణ కళాశాల్లో చదివారు. ఇండోర్‌లో ఐఐటీ పూర్తి చేశారు. ఐఐటీ తర్వాత డెలాయిట్ కన్సల్టెంట్‌లో ఏడాది ఉద్యోగం చేశారు. ఆపై సివిల్స్ సాధించాలనే లక్ష్యంతో బెంగుళూరు కేంద్రంగా సన్నాహాలు చేశారు. తొలి, మలి ప్రయత్నాల్లో మెయిన్స్ పూర్తి చేసి ఇంటర్వ్యూ వరకూ వెళ్లారు. మూడో ప్రయత్నంలో ఇంటర్వ్యూలో నెగ్గి 151 ర్యాంకు సాధించి ఐఏఎస్ కావాలనే లక్ష్యం నెరవేర్చుకున్నారు. బుధవారం ఢిల్లీలో ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూ కోసం వేచిఉన్న శ్రీకాంత్‌రెడ్డికి సివిల్స్ ఫలితాలు సంతోషాన్ని ఇచ్చాయి. ఐఏఎస్ సాధించిన నేపథ్యంలో ఐఎఫ్ఎస్ ఇంటర్వ్యూకు మరొకరికి ఛాన్సు వస్తుందనే ఉద్దేశ్యంతో ఢిల్లీ నుంచి స్వగ్రామానికి వెనుతిరిగారు. ఈసందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ చదువుకు కుటుంబ నేపథ్యం అడ్డురాదని, లక్ష్యసాధన దిశగా పట్టుదలతో రాణించాలన్నారు. బేసిక్స్‌పై సంపూర్ణంగా పట్టు సాధించాలన్నారు. లక్ష్యాన్ని నెరవేర్చుకునేందుకు అదే స్థాయిలో కష్టపడాలన్నారు. శ్రీకాంత్ రెడ్డి తండ్రి సుబ్బారెడ్డి మాట్లాడుతూ శ్రీకాంత్‌రెడ్డి చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదువులో రాణించారన్నారు. ఉన్నతస్థాయికి చేరుకుంటారనే ఆశాభావం ఉండేదని, చదువుకు ఎలాంటి ఆటంకం లేకుండా జాగ్రత్తపడ్డామని తెలిపారు. సివిల్స్ ఫలితాల్లో ఐఏఎస్ సాధించారని తెలియగానే చాలా సంతోషపడ్డామన్నారు.

పీహెచ్ఎన్ పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతం



పదోన్నతుల కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న ఆర్డీ డాక్టర్ రామగిడ్డయ్య

కడప రూరల్: వైద్య ఆరోగ్య శాఖ ప్రాంతీయ కార్యాలయం జోన్-4 పరిధిలో మంగళవారం నిర్వహించిన పదోన్నతుల కౌన్సెలింగ్ ప్రశాంతంగా ముగిసింది. 22 మంది ఎంపీహెచ్ఎస్ (ఎఫ్) లకు పీహెచ్ఎన్ (ఎన్‌టీ)లుగా పదోన్నతి కల్పించారు. ఈ కౌన్సెలింగ్‌కు 22 మందికి గాను 18 మంది ప్రమోషన్‌లు పొందారు. నిబంధనల ప్రకారం పదోన్నతులు కల్పించినట్లు ఆ శాఖ రీజనల్ డైరెక్టర్ డాక్టర్ రామగిడ్డయ్య తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ భక్తవత్సలం, సూపరింటెండెంట్ వెంకటసుబ్బమ్మ, సీనియర్ అసిస్టెంట్స్ వనీష, బత్తనయ్య పాల్గొన్నారు.

ఆర్‌పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ఫణీంద్ర కుమార్



ఫణీంద్రకుమార్‌కు నియామక పత్రం అందిస్తున్న రాష్ట్ర అధ్యక్షుడు బ్రహ్మానంద రెడ్డి

కడప కార్పొరేషన్: రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా జవ్వాజి ఫణీంద్ర కుమార్ నియమితులయ్యారు. కేంద్రమంత్రి రాందాస్ అతవాలే, ఆ పార్టీ నేషనల్ వర్కింగ్ కమిటీ ప్రెసిడెంట్ ఎం. వెంకట స్వామి ఆదేశాల మేరకు మంగళవారం విజయ వాడలోని ఆ పార్టీ కార్యాలయంలో రాష్ట్ర అధ్యక్షుడు కొమ్మా రెడ్డి బ్రహ్మానంద రెడ్డి చేతుల మీదుగా ఫణీంద్ర కుమార్ నియామక పత్రాన్ని అందుకున్నారు.

జిల్లాలో ఎస్ఐల బదిలీ

కడప అర్బన్: జిల్లాలో వివిధ పోలీస్టేషన్‌లలో పనిచేస్తున్న 10 మంది ఎస్ఐలను బదిలీ చేస్తూ కర్నూలు రేంజ్ డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్ ఉత్తర్వులు జారీ చేశారు.

ఎస్ఐ పేరు	ప్రస్తుతం	బదిలీ
పి. ప్రతాప్‌రెడ్డి	కడప ట్రాఫిక్ యు/జి పిఎస్	కడప ఒన్‌టౌన్ యు/జి పిఎస్
జయరాములు	రిమ్స్ యు/జి పిఎస్	కడప ట్రాఫిక్ యు/జి పిఎస్
సునీల్‌కుమార్‌రెడ్డి	సైబర్ క్రైమ్, కడప	కలమల్ల పీఎస్
పి.హనుమంతు	ఎస్ఏకెఎన్ పీఎస్	ప్రొద్దుటూరు త్రీటౌన్ యు/జి పిఎస్
పి.యోగేంద్ర	ప్రొద్దుటూరు త్రీటౌన్ యు/జి పిఎస్	ఎస్ఏకెన్ పీఎస్
కె.సి. రాజు	బి.కోడూరు పీఎస్	ప్రొద్దుటూరు రూరల్ పీఎస్
పి. వెంకటసురేష్	ప్రొద్దుటూరు రూరల్ పీఎస్	బి.కోడూరు పిఎస్
బి. శివప్రసాద్	ఒంటిమిట్ట పీఎస్	బి.మఠం పీఎస్
జె.చంద్రశేఖర్	బి.మఠం పీఎస్	చక్రాయపేట పీఎస్
బి.వి కృష్ణయ్య	చక్రాయపేట పీఎస్	డీసీఆర్‌బీ, కడప

డెంటల్ టెక్నీషియన్ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలి

కడప రూరల్: జిల్లాలో నేషనల్ హెల్త్ మిషన్ డీఈఐసీ ప్రోగ్రామ్ కింద కాంట్రాక్టు డెంటల్ టెక్నీషియన్‌గా పనిచేసేందుకు అర్హులు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. ఇందుకు సంబంధించిన దరఖాస్తు నమూనా, ఖాళీలు, ఇతర వివరాలు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కడప.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ను చూడాలని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తుకు నిర్దేశిత రుసుముతో సంబంధిత సర్టిఫికెట్లను జతపరిచి మే 5వ తేదిలోగా దరఖాస్తులను రిజిష్టర్ పోస్టు ద్వారా జిల్లా వైద్య, ఆరోగ్యశాఖాధికారి కడప అనే చిరునామాకు పంపాలన్నారు.

సామాజిక రుగ్మతలను నిర్మూలిద్దాం

జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశంలో కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి, చిత్రంలో ఎస్పీ

కడప సెవెన్‌రోడ్స్: దళితులకు ఎక్కడా అన్యాయం జరగకూడదని, జిల్లాలో సామాజిక రుగ్మతలను సమూలంగా తొలగించడమే లక్ష్యంగా పారదర్శకంగా, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని బోర్డు మీటింగ్ హాలులో కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జిల్లా విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సమావేశం జరిగింది. ఈ సమావేశానికి కలెక్టర్‌తో పాటు ఎస్పీ అశోక్ కుమార్, ఇన్‌చార్జి డీఆర్వో వెంకటపతి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులలో బాధితులకు న్యాయంతో పాటు త్వరితగతిన పరిహారం అందించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రస్తుత సమావేశంలో సభ్యులు లేవనెత్తిన అంశాలపై తదుపరి సమావేశం నాటికి పూర్తి స్థాయిలో పరిష్కరించే దిశగా సంబంధిత అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఎస్పీ ఈజీ అశోక్ కుమార్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని సాంఘిక సంక్షేమ హాస్టళ్లపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే పోక్సో చట్టం, బాల్య వివాహాలు నిరోధక చట్టం పైన ప్రజల్లో అవగాహన సదస్సులు నిర్వహించేలా చర్యలు చేపట్టాలని పోలీసు, రెవెన్యూ అధికారులను ఆదేశించారు. కడప, జమ్మలమడుగు, బద్వేలు డివిజన్ల ఆర్.డి.ఓలు జాన్ ఇర్విన్, సాయిశ్రీ, చంద్రమోహన్, సంబంధిత డివిజన్ల డీఎస్పీలు పాల్గొన్నారు.

అక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ‘ఉల్లాస్’ ఉద్దేశ్యం

సమాజంలో ప్రతి ఒక్కరినీ నిరక్షరాస్యులుగా తీర్చిదిద్దడమే ‘ఉల్లాస్’కార్యక్రమ ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా వయోజన విద్య శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ అధ్యక్షతన జిల్లాలో రెండవ విడత ‘ఉల్లాస్’కార్యక్రమం నిర్వహణపై.. జిల్లా స్థాయి కమిటీ కన్వర్జేన్స్ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2025–26లో జిల్లాలో మొత్తం 33,132 మందికి అక్షరాస్యత లక్ష్యం నిర్దేశించడం జరగగా, అందుకు అనుగుణంగా లక్ష్యాన్ని చేరుకునేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.

పశు పోషణతో రైతులకు ఆర్థిక బలం

గ్రామీణ స్థాయిలో పశు పోషణ ద్వారా రైతులను ఆర్థికంగా బలోపేతం చేయడమే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రధాన ఉద్దేశ్యమని కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. మంగళవారం కలెక్టరేట్ లోని పీజీఆర్ఎస్ హాలులో జేడీ డాక్టర్ శారదమ్మ అధ్యక్షతన పశుసంవర్ధక శాఖ జిల్లాస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కలెక్టర్ హాజరై ఆ శాఖలో విభాగాల వారీగా సంబంధిత అధికారులతో సమీక్షించారు.

ఫెయిల్ పరీక్షకే.. జీవితానికి కాదు

ఆత్మస్థైర్యం..సాధించాలన్న తపన ఉంటే చాలు...ఎంతటి కష్టాలనైనా ఎదుర్కోవచ్చు. పరీక్షలు..మార్కులు ర్యాంకులే పరమావధి కాదు. తక్కువ మార్కులు వచ్చినా.. ఫెయిలైనా జీవితం ముగిసిపోదు. క్షణికావేశ నిర్ణయాలు మంచిది కాదు. నిరాశ చెందకుండా మరింత ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే విజయం పాదాక్రాంతం అవుతుందని విద్యావేత్తలు, సైకాలజిస్టులు సూచిస్తున్నారు. బుధవారం పదో తరగతి పరీక్ష ఫలితాలు విడుదల కానున్న నేపథ్యంలో ప్రత్యేక కథనం.

- జిల్లాలో 27,800 మంది విద్యార్థులు ఫలితాల కోసం ఎదురుచూపులు
- నేడు పది పబ్లిక్ పరీక్షల ఫలితాలు విడుదల



పదవ తరగతి పరీక్షలు రాస్తున్న విద్యార్థులు (ఫైల్)

కడప ఎడ్యుకేషన్: ఇటీవలే ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలు వచ్చాయి. ఆ ఫలితాల్లో ఫెయిల్ అయ్యామన్న బాధతో కొంతమంది, తక్కువ మార్కులు వచ్చాయని మరికొంత మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోవడం చాలా బాధాకరమైన విషయం. ఇక ఏం చేసినా, ఎన్నికోట్లు ఖర్చు పెట్టినా వారి ప్రాణాలు మాత్రం తిరిగిరావు. అంతేకాదు ఆశలన్నీ పిల్లలపైనే పెట్టుకొని బతుకుతున్న తల్లిదండ్రులకు తీరని కడుపుకోత మిగిల్చారు. వారు ‘ఒక్కటంటే ఒక్క నిమిషం’ మనసు నిబ్బరంగా చేసుకొని ప్రశాంతంగా ముందున్న భవిష్యత్తు, తల్లిదండ్రుల గురించి ఆలోచించివుంటే వారు ఆత్మహత్యలు చేసుకునేవారు కాదు.

ఈ విషయాలు మరువద్దు

- పాస్, ఫెయిల్ అన్నవి అత్యంత సాధారణ విషయాలు. అందువల్ల విద్యార్థులు ఫలితాలు ప్రతికూలంగా ఉన్నా చాలా లైట్‌గా తీసుకోవాలి. ప్రశాంతంగా ఆలోచించాలి. పొరపాటు ఎక్కడ జరిగిందో తెలుసుకుని ముందుకు సాగాలి
- జరిగిన పొరపాటుకు కుంగిపోకుండా ఆత్మస్థైర్యాన్ని నింపుకోవాలి
- ఒత్తిడి నుంచి వేగంగా బయటపడేందుకు ప్రయత్నించాలి.
- వెనకబడిన పాఠ్యాంశాలపై ప్రత్యేక దృష్టిసారించాలి. అవసరమైతే ఉపాధ్యాయులు, సీనియర్ల సూచనలు, సలహాలు తీసుకోవాలి.
- ఫలితాలు విడుదలయ్యే సమయంలో తల్లిదండ్రులు తమ పిల్లలకు దగ్గరగా ఉండాలి.వారికి ధైర్యం చెప్పాలి.
- ఫలితాలు ప్రతికూలంగా ఉన్నా తల్లిదండ్రులు ఏమాత్రం కోపగించుకోకుండా పిల్లలతో చిరునవ్వుతో మాట్లాడాలి.



క్షణికావేశం వద్దు

టెన్త్ పబ్లిక్ పరీక్షల ఫలితాలను విడుదల చేసేందుకు విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. టెన్త్ ఫలితాల్లో ఎవరైనా ఫెయిల్ అయినా,ఎవరికైనా తక్కువ మార్కులు వచ్చినా.. క్షణికావేశంలో తొందరపాటు నిర్ణయాలు తీసుకోవద్దని విద్యావేత్తలు, మేధావులు చెబుతున్నారు. ఫలితాలు ఎలా ఉన్నా కాసేపు ప్రశాంతంగా ఆలోచించుకొని ఆత్మవిమర్శ చేసుకోవాలి. ఓటమి విజయానికి తొలిమెట్టులాంటిది. పరీక్షల్లో మనం ఎందుకు తప్పాం, లోపం ఎక్కడుంది అని ఆలోచించి దాని అధిగమిస్తే త్వరలో జరిగే అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షల్లో తప్పక ఉత్తీర్ణులు కాగలరని విద్యావంతులు చెబుతున్నారు.

ముభావంగా ఉంటే అప్రమత్తం కండి

- టెన్త్ చదివే విద్యార్థులది కౌమారదశ. అందువల్ల వారి మనస్సు చాలా సున్నితంగా ఉంటుంది. చిన్న సమస్య వచ్చినా తట్టుకోలేరు. ఫలితాలు విడుదలయ్యాక మార్కులు తక్కువ వచ్చినా, ఫెయిల్ అయినా తల్లిదండ్రులు తమ పిల్లలను ఓ కంటకనిపెట్టి ఉంచాలి.
- ఆహారం తీసుకోక పోయినా, ఏదో ఆలోచిస్తూ ముభావంగా ఉన్నా వారిపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి.
- ఫెయిల్ అయిన వారిని ఒంటరిగా ఉంచకూడదు.

పిల్లలపై ఓ కన్నేసి ఉంచాలి




నేడు పదో తరగతి పరీక్షల ఫలితాలు విడుదల అవుతున్నాయి. ఈ సమయంలో విద్యార్థులు క్షణికావేశానికి లోనయ్యే అవకాశం ఉంటుంది. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు మార్కులు తక్కువగా ఫెయిల్ అయ్యే విద్యార్థులను చిన్నచూపు చూడకూడదు. విద్యార్థి ప్రతిభకు మార్కులు కొలమానం కానే కాదు. విద్యాసంస్థల యాజమాన్యాలు మార్కుల కోసం పిల్లలపై ఒత్తిడి తీసుకురాకూడదు. జీవితంలో ఏదైనా సాధించాలనే కసి, పట్టుదల, ఆత్మవిశ్వాసం కలిగిన వారే ఏదైనా సాధిస్తారు. ప్రపంచ విజేతలుగా నిలుస్తారు. – షేక్. షంషుద్దీన్, జిల్లా విద్యాశాఖ అధికారి, వైఎస్సార్‌జిల్లా

జీవితం నష్టపోదనే భరోసా ఇవ్వాలి



ఒకసారి పరీక్షలో తప్పితే జీవితం నష్టపోదనే భరోసా నివ్వాలి. మళ్లీ చదివి పాస్ కావచ్చనే ధైర్యం నింపాలి. పాస్ కాలేదని తిట్టకుండా, వేధించకుండా సముదాయించాలి. తిరిగి మంచిగా చదివి పాసయ్యేలా ప్రోత్సహించాలి. విద్యార్థులు కూడా క్షణికావేశానికి లోనుకాకుండా సమస్యను స్నేహితులు, తల్లిదండ్రులతో చర్చించాలి. మార్కులు కాదు జ్ఞానం ముఖ్యమనే విషయాన్ని తల్లిదండ్రులు గ్రహించాలి. – డాక్టర్ మహబూబ్‌అలీ, ఎండీ, కడప

ధ్రువపత్రాలు కేవలం అర్హతకే...



ప్రపంచ కుబేరుల్లో ఎక్కువ మంది పెద్ద చదువరులేం కాదు. వారు చేసిందల్లా ఒకటే.. నచ్చిన మార్గంలో ప్రయాణించి అనుకున్న లక్ష్యాన్ని చేరుకోవడం. మనం చదివిన విద్యా ధ్రువపత్రాలు కేవలం అర్హతగానే పరిగణించాలి. మార్కులు తక్కువ వచ్చాయనో..మనం కోరుకున్న కళాశాలలో సీటు దక్కలేదనో కుంగుబాటుకు గురవటం అనవసరం. ప్రతి ఒక్కరిలో ఏదో ఒక ప్రతిభ దాగి ఉంటుంది. దాన్ని తెలుసుకున్న రోజు ప్రపంచంలోను మనకన్నా గొప్పవారు ఎవరు ఉండరు. – ఓ. వెంకటేశ్వరరెడ్డి, ప్రముఖ సైకాలజిస్టు, కడప

చదువులో వెనకబడ్డా.. గొప్ప వ్యక్తులయ్యారు

- క్రికెట్ క్రీడాభిమానులు తమ ఆరాధ్య దైవంగా భావించే సచిన్ టెండూల్కర్ టెన్త్ ఫెయిల్ అయ్యారు. అయితేనేం తనకు ఆసక్తి ఉన్న క్రికెట్‌లో రాణించి ప్రపంచ వ్యాప్తంగా కీర్తి గడించారు.
- పాతతరం ప్రజలను, సినీ ప్రేక్షకులను అలరించిన దివంగత అక్కినేని నాగేశ్వరరావు విద్యాభ్యాసం ప్రాథమిక స్థాయిలోనే ఆగిపోయింది. అయితే ఆయన ఏమాత్రం కుంగిపోలేదు. నటనపై ఉన్న ఆసక్తితో చెన్నైకి వెళ్లి గొప్ప నటుడయ్యారు. అంతేకాదు దేశంలోనే మేటిగా ఉన్న అన్నపూర్ణ స్టూడియోను నిర్మించి అనేక మందికి ఉపాధిని కల్పించారు.
- అబ్దుల్‌కలాంకు మార్కులు తక్కువగా వచ్చేవి. కాని చదవడం, నేర్చుకోవడం అంటే ఆయనకు ఎనలేని ఇష్టం. అదే అబ్దుల్ కలాంను శాస్త్రవేత్తను, మనదేశానికి రాష్ట్రపతిని చేసింది. ‘భారతరత్న’ను కూడా తెచ్చిపెట్టింది.
- ప్రముఖ గాయని లతా మంగేష్కర్ ఎప్పు డూ స్కూల్‌కు వెళ్లలేదు. అయినా పాటల తోటలో గానకోకిలగా కీర్తి గడించారు.
- శ్రీనివాసరామానుజన్ గొప్ప గణిత మేధావి. కొన్నిసార్లు చదువులో ఇబ్బంది పడినా ఎప్పుడూ నిరాశ చెందకుండా లెక్కల్లో కొత్త విషయాలు తెలుసుకునేవారు. అతని మేధాశక్తిని గుర్తించిన గణిత ఆచార్యుల ద్వారా ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో పరిశోధనకు అవకాశం పొందారు.

క్లుప్తంగా

హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

కడప రూరల్ : హజ్ కమిటీ ద్వారా పవిత్ర హజ్ యాత్రకు వెళ్లే వారికి వ్యాధి నిరోధక టీకాలు వేసే కార్యక్రమాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఈనెల 24వ తేదీ నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ నాగరాజు తెలిపారు. గురువారం ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు పాత రిమ్స్ యూపీహెచ్‌సీ రాధాకృష్ణ నగర్‌లో ఈ కార్యక్రమం ఉంటుందన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

పోరుమామిళ్ల : దమ్మన్నపల్లెకు చెందిన తోట జయరాములు పాడి గేదె మంగళవారం ఉదయం విద్యుదాఘాతంతో మృతి చెందింది. పొలంలో విద్యుత్ వైర్లు తగిలి గేదె మృతి చెందినట్లు రైతులు తెలిపారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

యువతిని వేధిస్తున్న యువకుడిపై కేసు

కడప అర్బన్ : కడప నగరంలోని తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం ఉంటూ బ్యూటీపార్లర్ నిర్వహించుకుంటూ జీవనం సాగిస్తున్న ఓ యువతిని, గుంటూరుకు చెందిన ఇమ్రాన్ అనే వ్యక్తి తన ఫొటోలను పంపిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడనీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. గతంలో ఇమ్రాన్‌కు, బాధిత యువతికి వివాహం చేయాలని పెద్దలు మాట్లాడుకుని నిశ్చయించుకున్నారు. ఈ క్రమంలో మరలా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో వివాహం వద్దనుకున్నారు. ఇదిలా ఉండగా ఇమ్రాన్ యువతిని పదేపదే వేధింపులకు గురి చేస్తుండటంతో బాధితురాలి ఫిర్యాదు మేరకు కడప తాలూకా ఎస్ఐ తాయార్‌హుసేన్ కేసు నమోదు చేశారు.

బంగారు గొలుసు లాక్కెళ్లిన దుండగుడు

కమలాపురం : పొలం పనుల్లో నిమగ్నమైన ఓ మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కెళ్లిన సంఘటన కోగటం గ్రామంలో జరిగింది. స్థానికులు, పోలీసుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మంగళవారం మధ్యాహ్నం కోగటం గ్రామానికి చెందిన బండి వెంకట లక్షుమ్మ అనే మహిళ గ్రామ సమీపంలోని తమ పొలంలో పశువుల మేత కోసుకోవడానికి వెళ్లింది. మేత కోసుకుంటున్న సమయంలో అక్కడ ఎవరూ లేరని తెలుసుకున్న దుండగుడు మహిళ మెడలో ఉన్న గొలుసును లాక్కెళ్లాడు. కాగా బంగారు గొలుసును దుండగుడు లాగే సమయంలో వెంకట లక్షుమ్మ కూడా గొలుసును గట్టిగా పట్టుకుంది. అయినప్పటికి గొలుసు విరిగి పోవడంతో దుండగుడు లాక్కొని పరారయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న ఎస్ఐ విద్యా సాగర్ సిబ్బందితో కలసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. చోరీ జరిగిన తీరును బాధిత మహిళను అడిగి తెలుసుకున్నారు. చుట్టు పక్కల ప్రాంతాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. కాగా బాధిత మహిళ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. మహిళలు బంగారు ఆభరణాలు ధరించి ఒంటరిగా వెళ్లవద్దని, సీఐ రోషన్, ఎస్ఐ విద్యాసాగర్ సూచించారు.

సిబ్బంది కొరత.. వాహనదారులకు వెత

- రవాణా శాఖలో సకాలంలో వాహనదారులకు అందని సేవలు
- ఎఫ్‌సీ నుంచి డ్రైవింగ్ లైసెన్స్ వరకు తప్పని ఇబ్బందులు
- రెండు నెలల నుంచి రెగ్యులర్ అధికారి లేని వైనం



ఊటుకూరులోని జిల్లా ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కడపలోని జిల్లా ఉప రవాణా శాఖ కమిషనర్ కార్యాలయంలో వాహనదారులకు సేవలు కాలంలో అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఎల్ఎల్ఆర్ నుంచి వాహనాల బదిలీల వరకు అన్నీ జిల్లా ఉప రవాణా శాఖ కార్యాలయంలో జరగాల్సి ఉంది. అయితే ఓవైపు ఉన్న సిబ్బంది తీరు, మరో వైపు సిబ్బంది కొరత వల్ల సేవలు కుంటుపడుతున్నాయి.

రెండు నెలలుగా ఇన్‌చార్జి పాలన..

ఉప రవాణాశాఖ కమిషనర్ కార్యాలయంలో గత రెండు నెలల నుంచి రెగ్యులర్ రవాణాశాఖ అధికారి లేరు. దీంతో ఇన్‌చార్జి డీటీసీగా అన్నమయ్య జిల్లా డీటీసీ ప్రసాద్‌కు బాధ్యతలు అప్పగించారు. దీంతో ఆయన అన్నమయ్య జిల్లాతో పాటు వైఎస్ఆర్ జిల్లాలో తమ సేవలను అందించాలంటే ఇబ్బందులు తప్పడం లేదు.

వేధిస్తున్న సిబ్బంది కొరత ..

రవాణాశాఖ కార్యాలయంలో సిబ్బంది కొరత వేధిస్తోంది. మొత్తం కార్యాలయంలో సిబ్బంది పది మంది ఉండాల్సి ఉండగా నలుగురు మాత్రమే ఉన్నారు. ఫలితంగా వాహనదారులకు సేవలు సకాలంలో అందడం లేదు. కడప రవాణా శాఖ కార్యాలయంలో ఇద్దరు ఎంవీఐలు ఉండాల్సి ఉండగా ఒక ఎంవీఐ సెలవులో వెళ్లడంతో ఉన్న ఒక ఎంవీఐనే దిక్కయ్యారు.

వాహనాల ఎఫ్‌సీలో దళారుల ఇష్టారాజ్యం..

వాహనాలకు ఎఫ్‌సీ చేయాలంటే దళారులను సంప్రదిస్తే సేవలు సులువుగా అందుతున్నాయి. ఎవరైనా ఎఫ్‌సీ నేరుగా చేయించుకుంటే వారికి ఎఫ్‌సీ అయి పోయినా పత్రాలు అందడం లేదు. కింది స్థాయి సిబ్బంది పెత్తనం చెలాయిస్తూ దండుకుంటున్నారు. వీటన్నింటికి కారణం రెగ్యులర్ అధికారి లేకపోవడమే అనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ప్రభుత్వానికి చెల్లించాల్సిన రుసుం కంటే మూడింతలు దళారులకు ఇస్తే వారు సకాలంలో పనులు చేయిస్తున్నారు. లేకుంటే రవాణా శాఖ కార్యాలయం చుట్టూ ప్రదక్షిణలు చేయక తప్పడం లేదు.

> **రవాణా శాఖలో వాహనదారులకు మెరుగైన సేవలు**
>
> రవాణాశాఖ తరపున వాహనదారులకు మెరుగైన సేవలను అందించేందుకు కృషి చేస్తున్నాం. కార్యాలయంలో సిబ్బంది కొరత ఉండటంతోనే సేవలు సకాలంలో అందడం లేదు. వాహనదారులకు వారి వాహనాలకు సంబంధించిన పత్రాలను సకాలంలో అందిస్తాం.
>
> – ప్రసాద్, ఇన్‌చార్జి డీటీసీ.

ఉద్దేశ పూర్వకంగానే డీఎస్పీపై ఎమ్మెల్యే వరద ఆరోపణలు

మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



ప్రొద్దుటూరు : ఎలాంటి తప్పు చేయకుండా, ఆధారం లేకుండానే అధికార పార్టీ నేతలపై పోలీసులు కేసులు పెట్టే పరిస్థితులు ఈ రోజుల్లో ఉన్నాయా అని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రాచమల్లు శివ ప్రసాదరెడ్డి ప్రశ్నించారు. కాశీ నుంచి మంగళవారం లైవ్ ద్వారా మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాచమల్లు మాట్లాడుతూ కేవలం ఉద్దేశ పూర్వకంగానే పోలీసులు, రెవెన్యూ అధికారులపై ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి విమర్శలు చేస్తున్నారన్నారు. తన మాట వినని అధికారులపై లంచగొండి అనే ట్యాగ్ వేయడం ఆయనకే చెల్లునన్నారు. అధికార పార్టీ ఎమ్మెల్యేగా ఉండి ఆయన అధికారులు లంచగొండులు అని, అసమర్థులని, అవినీతిపరులని మాట్లాడటాన్ని బట్టి ప్రభుత్వం పరిస్థితి ఏవిధంగా ఉందో అర్థమవుతోందన్నారు. కేవలం తన అనుచరుడు దొరసానిపల్లె సర్పంచ్ భర్త మునివరపై క్రికెట్ బుకీ కేసు నమోదు చేసినందుకే ఆయన డీఎస్పీని అవినీతి పరురాలిగా చిత్రీకరించారన్నారు. డీఎస్పీతోపాటు పోలీసులు మద్యం షాపుల నుంచి నెల మామూళ్లు వసూలు చేస్తున్నారని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి ఆరోపించడంలో అర్థం లేదని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు తెలిపారు. 30 ఏళ్లకుపైగా అటు ఎక్సైజ్ అధికారులు, ఇటు పోలీసులు మామూళ్లు తీసుకోవడం ఆనవాయితీ అయిందన్నారు. ఇటీవల టీడీపీ కార్యక్రమం నిర్వహణ కోసం మద్యం షాపుల యజమానుల నుంచి రూ.10లక్షలు అడిగిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు.

క్రీడలతో పాటు వ్యాయామం తప్పనిసరి

రేంజ్ పోలీసుల క్రీడా పోటీల్లో ఏఆర్ అడిషనల్ ఎస్పీ



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ఏఆర్ అడిషనల్ ఎస్పీ

కర్నూలు : పోలీసు సిబ్బందికి క్రీడలు, వ్యాయామం చాలా అవసరమని, వీటి ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం మెరుగవుతుందని ఏఆర్ అడిషనల్ ఎస్పీ కృష్ణమోహన్ అన్నారు. కర్నూలు, కడప, నంద్యాల, అన్నమయ్య జిల్లాల (రేంజ్ పరిధిలో) పోలీసులకు కర్నూలు నగరంలోని ఔట్‌డోర్ స్టేడియంలో మంగళవారం క్రీడల పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ క్రీడలు మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. కర్నూలు డీఐజీ డాక్టర్ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆధ్వర్యంలో క్రీడాపోటీల్లో పాల్గొనడానికి ఆసక్తి ఉన్న పోలీసు సిబ్బందికి అవకాశం కల్పించారు. ఫుట్‌బాల్, వాలీబాల్, కబడ్డీ, హ్యాండ్‌బాల్, షటిల్, రన్నింగ్, లాంగ్ జంప్, హైజంప్, షాట్‌పుట్, క్రికెట్, బాస్కెట్ బాల్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ భాస్కర్ రావు, ఆర్ఐలు, రేంజ్ పరిధిలోని వివిధ జిల్లాలకు చెందిన పోలీసు సిబ్బంది పోటీల్లో పాల్గొన్నారు.

డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను వినియోగించుకోండి

కడప ఎడ్యుకేషన్ : యూటీఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న డీఎస్సీ ఉచిత కోచింగ్‌ను జిల్లాలోని డీఎస్సీ అభ్యర్థులు వినియోగించుకోవాలని డీఈఓ షేక్ షంషుద్దీన్ కోరారు. మంగళవారం కడపలోని జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఎస్సీ ఉచిత కోచింగ్‌కు సంబంధించిన కరపత్రాలను యూటీఎఫ్ నాయకులతో కలిసి ఆయన ఆవిష్కరించారు. కడపలోని యూటీఎఫ్ భవన్‌లో ఉచిత కోచింగ్ నిర్వహించనుండటం అభినందనీయమన్నారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ ఆసక్తి కలిగిన అభ్యర్థులు కె.నరసింహారావు 9440384701, జి.గోపీనాథ్ 9885125056 ను సంప్రదించి రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ నెల 24వ తేదీ ఉదయం 9:30 గంటలకు కడపలోని యూటీఎఫ్ భవన్‌లో అవగాహన సదస్సు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ట్రెజరర్ నరసింహారావు, జిల్లా కార్యదర్శులు సి.వి.రమణ, ఎస్.ఏజాస్ అహమ్మద్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రూతు ఆరోగ్య మేరీ, కృష్ణా రెడ్డి, ఆడిట్ కమిటీ కన్వీనర్, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన ఎస్పీ అశోక్ కుమార్



జిల్లా ప్రధాన న్యాయమూర్తి డాక్టర్ సి.యామినికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎస్పీ అశోక్‌కుమార్

కడప అర్బన్ : కడపలోని జిల్లా కోర్టులో ప్రధాన న్యాయమూర్తిగా ఈనెల 20న బాధ్యతలను స్వీకరించిన డాక్టర్ సి. యామిని మంగళవారం జిల్లా కోర్టుకు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్ ఆమెను మర్యాదపూర్వకంగా కలిశారు. పుష్పగుచ్ఛం అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. న్యాయ వ్యవస్థ, పోలీస్ శాఖ సమన్వయంతో కృషి చేసి ప్రజలకు న్యాయం అందుబాటులో ఉండేలా చూసేందుకు చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. కడప జిల్లా జ్యుడీషియల్ ఎంప్లాయాస్ అసోసియేషన్ ప్రెసిడెంట్ పి.శశికాంత్‌రెడ్డి, సభ్యులు కూడా జిల్లా ప్రధాన న్యాయమూర్తిని మర్యాద పూర్వకంగా కలిశారు.

పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు



ప్రతిభా పురస్కారాల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న పద్మశాలీయ అభ్యుదయ సంఘం నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ కనబరిచిన పద్మశాలీయ విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించనున్నట్లు పద్మశాలీయ అభ్యుదయ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చెన్నా చంద్రబాబు తెలిపారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం పద్మశాలీయ ప్రతిభా పురస్కారాల కరపత్రాలను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పదో తరగతిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదివి అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.4వేలు, ద్వితీయ బహుమతి రూ.3వేలు అందిస్తామన్నారు. స్థానికంగా ఇంటర్ చదివి ప్రతి గ్రూపులో 900 మార్కులకుపైగా సాధించిన విద్యార్థులకు ప్రథమ బహుమతి రూ.5వేలు, ద్వితీయ బహుమతి రూ.4వేలు అందిస్తామని చెప్పారు. టెన్త్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో చదివి 450కిపైగా మార్కులు సాధించిన విద్యార్థులకు కన్సొలేషన్ బహుమతి రూ.3వేలు, ఎంసెట్, నీట్, మెడిసిన్, ఇంజనీరింగ్, ఐఐటీ, జేఈఈ మెయిన్స్‌లో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.5వేలు నగదు బహుమతి, మెమెంటో, ప్రశంసా పత్రాలు అందిస్తామన్నారు. పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచిన పద్మశాలీయేతర విద్యార్థులకు రూ.4వేలు నగదు బహుమతి అందిస్తామన్నారు. అర్హులైన విద్యార్థులు మే 17వ తేదీలోపు తమ దరఖాస్తులను పద్మశాలీయ కల్యాణ మండపంలో అందించాలని కోరారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మే 27న ప్రముఖుల చేతుల మీదుగా ప్రతిభా పురస్కారాలను అందిస్తామన్నారు. మరిన్ని వివరాలకు 9032705866, 9290571411 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు. సమావేశంలో పద్మశాలీయ అభ్యుదయ సంఘం ప్రధాన కార్యదర్శి వద్ది నాగరాజు, ఉపాధ్యక్షుడు మునిస్వామి, కోశాధికారి శ్రీనివాసులు, ఆనంద్, సంజీవరాయుడు, జానకిరామయ్య పాల్గొన్నారు.

భార్యాభర్తల సమస్యను రాజకీయం చేయొద్దు



విలేకరులతో మాట్లాడుతున్న పఠాన్ మున్వర్, ఖాసీం వలీ

వేంపల్లె : భార్యాభర్తల సమస్యను కొందరు వ్యక్తులు రాజకీయం చేయడంతో కుటుంబాలు నాశనమవుతున్నాయని, ఇది మంచిది కాదని పఠాన్ మున్వర్, ఖాసీం వలీలు పేర్కొన్నారు. మంగళవారం నందిపల్లెలో వారు విలేకరులతో మాట్లాడుతూ గత రెండేళ్ల క్రితం వీరపునాయునిపల్లె మండలంలోని నేలతిమ్మయ్యగారిపల్లెకు చెందిన పెద్ద బాదుల్లా కుమార్తె షీరిన్ భానును వివాహం చేసుకున్నట్లు చెప్పారు. అయితే వివాహమైనప్పటి నుంచి భార్యాభర్తల మధ్య విభేదాలు ఎప్పుడు లేవని, భార్యను ఎప్పుడు హింసించలేదని వారు తెలిపారు. చిన్న మాట విషయంలో తన భార్య అయిన షీరిన్ పుట్టింటికి వెళ్లిందన్నారు. పెద్ద మనుషులను తీసుకొని వచ్చి సంజాయిషీ చెప్పక పోగా, చిన్నమామ చిన్న బాదుల్లా అనే వ్యక్తి ఘర్షణ జరగడానికి మూల కారణమన్నారు. గత ఆదివారం రాత్రి చిన్న బాదుల్లా అనే వ్యక్తి రాజకీయం చేసి వేంపల్లెలోని బిడ్డాలమిట్ట ప్రాంతంలో ఉన్న అబ్దుల్‌తో పాటు 40 మందిని కత్తులు, రాడ్లతో పిలుచుకొని వచ్చి తమ కుటుంబంపై దాడి చేశారని తెలిపారు. గ్రామస్తులందరూ ఏకమై అడ్డుకోవడంతోనే తాము ప్రాణాలతో బయటపడినట్లు చెప్పారు. కుటుంబ సమస్యలను రాజకీయాలకు అంటగట్టడం తగదన్నారు.

బెల్ట్‌షాపులపై దాడులు

కమలాపురం : కమలాపురం పట్టణంలోని బెల్ట్ షాపులపై ఎక్సైజ్ అధికారులు దాడులు చేశారు. మంగళవారం ఎక్సైజ్ సీఐ గోపీక్రిష్ణ తన సిబ్బందితో ఈ దాడులు నిర్వహించారు. కమలాపురం పట్టణంతో పాటు మండలంలో పుట్టగొడుగుల్లా బెల్ట్‌షాపులు వెలిశాయి. పట్టణంలో 7 బెల్ట్‌షాపులు నడుస్తున్నట్లు ఫిర్యాదులు అందడంతో దాడులు చేశామని సీఐ తెలిపారు. కాగా దాడుల సమయంలో కేవలం ఒక షాపులో మాత్రమే 6 క్వార్టర్ మద్యం బాటిళ్లు లభించాయని, నిర్వాహకుడు గోపాల్ పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు. కాగా పట్టణంలో అర కిలోమీటరుకు ఒక బెల్ట్‌షాపు నిర్వహిస్తున్నారని, కూటమి ప్రభుత్వంలో అడుగడుగునా మద్యం విక్రయాలు జరుగుతున్నాయని, బెల్ట్‌షాపులను పూర్తిగా అరికట్టాలని ప్రజలు కోరుతున్నారు.

బ్రహ్మంగారిమఠంలో

బ్రహ్మంగారిమఠం : పుణ్యక్షేత్రమైన బ్రహ్మంగారిమఠంలో బెల్ట్ షాపులపై బి.మఠం పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడులలో ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. 'సాక్షి'లో ప్రచురితమైన బెల్ట్‌పై కొరవడిన నిఘా అనే వార్తతో పోలీసుల్లో చలనం వచ్చింది. బి.మఠం టీడీపీలో రెండు వర్గాలు ఉన్నాయి. రెండు వర్గాలకు చెందిన వారు పోటాపోటీగా బెల్ట్ షాపులను ఏర్పాటు చేయించారు.

20 మద్యం బాటిళ్లు పట్టివేత

చాపాడు : మండల పరిధిలోని సోమాపురం గ్రామంలో అక్రమంగా విక్రయిస్తున్న 20 మద్యం బాటిళ్లను సోమవారం రాత్రి పోలీసులు పట్టుకున్నారు. ట్రైనీ డీఎస్పీ భవానీ సిబ్బందితో కలసి గ్రామంలోని బెల్టు షాపులపై దాడులు నిర్వహించగా గ్రామానికి చెందిన రాధా అనే మహిళ ఇంటి వద్ద నిర్వహిస్తున్న దుకాణంలో సోదాలు చేయగా రూ.2వేలు విలువ చేసే 20 మద్యం బాటిళ్లు పట్టుకున్నారు.

ప్రేమ విఫలమై యువకుడు ఆత్మహత్య



మృతి చెందిన వెంకటనరసింహులు

ప్రొద్దుటూరు క్రైం : తన ప్రేమ విఫలమైందనే బాధతో వెంకటనరసింహులు (24) అనే యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ప్రొద్దుటూరులో జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. ప్రొద్దుటూరులోని ఈశ్వరరెడ్డినగర్‌కు చెందిన సానా లక్ష్మీదేవికి ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. కుమార్తెకు వివాహమైంది. పెద్ద కుమారుడు సురేష్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తుండగా మరో కుమారుడు వెంకటనరసింహులు కాంట్రాక్ట్ పనులు చేసుకునేవాడు. వీరు తొగట కులస్తులైనప్పటికీ క్రైస్తవ మతంలోకి మారారు. వెంకటనరసింహులు కొన్ని నెలల క్రితం ఒక అమ్మాయిని ప్రేమించాడు. అయితే వారి మధ్య ఏం జరిగిందో ఏమోగానీ ప్రేమ విఫలమైంది. ఈ విషయమై అతను కొన్ని రోజుల నుంచి తనలో తాను బాధ పడుతూ ఉండేవాడు. ఆ అమ్మాయి ఎవరో చెబితే తాము వెళ్లి మాట్లాడుతామని కుటుంబ సభ్యులు పలుమార్లు అడిగినా అతను చెప్పలేదు. 'నాకు బతకాలని లేదు.. జీవితంపై విరక్తి కలుగుతోంది.. బతకడం కంటే చనిపోవడం మేలు' అని చెబుతూ ఉండేవాడు. అయినా కుటుంబ సభ్యులు వెంకటనరసింహులుకు ధైర్యం చెబుతూ సముదాయించేవారు. ఈ క్రమంలో ఈస్టర్ పండుగ సందర్భంగా కడపలో ఉన్న చెల్లెలు శిరీష, హైదరాబాద్‌లో ఉంటున్న అన్న సురేష్ ఇంటికి వచ్చారు. పండుగ అనంతరం సోమవారం చెల్లెలిని వదిలి పెట్టేందుకు సురేష్‌తో పాటు తల్లి లక్ష్మీదేవి కడపకు వెళ్లారు. వారు రాత్రి ఇంటికి వచ్చి చూడగా వెంకటనరసింహులు ఇంటి రేకులకు ఉన్న ఇనుప పైపునకు చీరను చుట్టి ఉరేసుకున్నాడు. వెంటనే అతన్ని ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యుడు తెలిపారు. ఈ మేరకు మృతుడి అన్న సురేష్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ ఎస్ఐ సంజీవరెడ్డి తెలిపారు.

మట్టి మాఫియా!

- యథేచ్ఛగా మట్టి అక్రమ రవాణా
- మామూళ్ల మత్తులో అధికారులు
- జేబులు నింపుకుంటున్న తెలుగు తమ్ముళ్లు



పోలీసు స్టేషన్ పక్క నుంచే మట్టి లోడ్‌తో వెళుతున్న టిప్పర్

సాక్షి, టాస్క్‌ఫోర్స్ : కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రకృతి వనరులైన గ్రావెల్, మట్టిని తెలుగు తమ్ముళ్లు దోచుకొని మట్టి మాఫియాకు తెగబడ్డారు. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా పోలీసు స్టేషన్ ముందు నుంచే టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు, ఇరిగేషన్ అధికారులు మామూళ్ల మత్తులో చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారు. తెలుగు తమ్ముళ్లు సాయంత్రానికి లక్షలు జేబులు నింపుకుటున్నారు.

పెండ్లిమర్రి మండలంలోని వెల్లటూరు గ్రామ సమీపంలోని ఎగువ చెరువు (పెద్దదాసరిపల్లె చెరువు)లో నుంచి వారం రోజుల నుంచి పదుల సంఖ్యలో టిప్పర్లు, ట్రాక్టర్ల ద్వారా మట్టి అక్రమ రవాణాకు పాల్పడుతున్నారు. చెరువులో భారీ హిటాచి యంత్రంతో రోజుకు దాదాపు వంద టిప్పర్ల చొప్పున ఒక్కొక్క టిప్పర్‌కు లోడింగ్, మట్టికి రూ.2వేలు వసూలు చేసున్నారు. ఆ విధంగా ప్రతి రోజు దాదాపు రూ.2లక్షలు ఆదాయం కూటమి నాయకులు చేతుల్లోకి వెళుతోంది. ప్రభుత్వ అనుమతులు లేకున్నా లోడింగ్‌కు రూ.2వేలు ఎందుకు ఇవ్వాలని ప్రశ్నిస్తే దానికి సమాధానం ఉండదు. మా ప్రభుత్వం.. మా ఇష్టం వచ్చినట్లు వసూలు చేస్తాము అన్నట్లుగా నిర్వాహకులు వ్యవహరిస్తున్నారు. అక్రమ రవాణాను అడ్డుకోవాల్సిన రెవెన్యూ, పోలీసు, మైనింగ్ అధికారులు అటు వైపు తొంగి చూడడంలేదు. ఆ దారిలో పంటలు సాగు చేసిన రైతులు పంట పొలాలకు దుమ్ము నిండుకొని పంటలు దెబ్బతింటున్నాయని వాపోతున్నారు. పెండ్లిమర్రి ఎస్ఐ మధుసూదన్ రెడ్డి మూడు రోజుల క్రితం మట్టి తోలుతున్న టిప్పర్లను అదుపులోకి తీసుకొని ప్రభుత్వ అనుమతులు లేకుండా అక్రమంగా మట్టి రవాణాకు పాల్పడితే ఎంతటి వారైనా చర్యలు తీసుకుటామని చెప్పారు. కాని పెండ్లిమర్రి పోలీసు స్టేషన్ పక్క నుంచే ఉదయం నుంచి సాయంత్రం దాకా అనుమతులు లేకుండా తిరుగుతున్నా పట్టించుకోవడం లేదని ప్రజలు విమర్శిస్తున్నారు. ఎగువ చెరువులో మట్టికి ప్రభుత్వ అనుమతులు ఉన్నాయా.. లేవా అని పెండ్లిమర్రి తహసీల్దార్ అనురాధను వివరణ కోరగా ఆమె వీఆర్ఓను అడిగి తెలుసుకుంటా అని సమాధానం దాటవేశారు.

హత్య కేసులో నలుగురు నిందితుల అరెస్టు

- నిందితుల్లో ముగ్గురు రౌడీషీటర్లు
- హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, సెల్‌ఫోన్‌లు స్వాధీనం
- విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ ఈ.జీ. అశోక్‌కుమార్ వెల్లడి



హత్య కేసులో నిందితుల అరెస్టు వివరాలను వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ ఈ.జీ. అశోక్‌కుమార్

కడప అర్బన్ : కడప నగరంలోని బిల్టప్ సర్కిల్ వద్ద ఈనెల 15వ తేదీ రాత్రి జరిగిన హత్య కేసులో నలుగురు నిందితులను కడప తాలూకా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి హత్యకు ఉపయోగించిన రెండు కత్తులు, మూడు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం కడపలోని జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ ఈ.జీ. అశోక్ కుమార్ వివరాలు వెల్లడించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ కడప తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో రవీంద్రనగర్‌కు చెందిన షేక్ సాదిక్‌వలీ (32) పాతబస్టాండ్‌లో పండ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడన్నారు. ఈనెల 15వ తేదీ రాత్రి 8.20 గంటల సమయంలో హతుడు షేక్ సాదిక్ వలీ, ఇంకొక వ్యక్తితో కలిసి బిల్టప్ సర్కిల్‌లోని వైన్ షాప్ వద్ద ఉండటాన్ని నిందితులు గమనించారన్నారు. నలుగురు నిందితులు పథకం ప్రకారం షేక్ సాదిక్ వలీతో మాట్లాడినట్లుగా నటించారన్నారు. 2024 జూలై 19వ తేదీ రాత్రి బిల్టప్ సమీపంలో జరిగిన చింపిరి వెంకటేసు అనే వ్యక్తి హత్య కేసులో నిందితుడిగా ఉన్న షేక్ సాదిక్ వలీపై ప్రతీకారంతో ఉన్న నిందితులు కత్తులతో దారుణంగా హత్య చేశారన్నారు. సాదిక్ వలీ హత్య కేసులో ప్రధాన నిందితుడైన చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడుకు చింపిరి వెంకటేశు ప్రధాన అనుచరుడని తెలిపారు. సాదిక్ వలీ హత్య కేసులో నిందితులైన కడప నగరం రవీంద్రనగర్, మరాఠీవీధికి చెందిన రౌడీషీటర్ చప్పిడి రాయప్ప అలియాస్ పెద్దోడు, కడప నగరం మోచంపేటకు చెందిన రౌడీషీటర్ షేక్ గౌస్‌బాషా అలియాస్ కాలియా, కడప నగరం మరియాపురానికి చెందిన రౌడీషీటర్ శీలం బాలస్వామి అనే ముగ్గురు రౌడీషీటర్లతో పాటు రవీంద్రనగర్, మరాఠీ వీధికి చెందిన సుంకర వెంకటేశును అరెస్టు చేశామని తెలిపారు. కడప తాలూకా స్టేషన్‌లో షేక్ సాదిక్ వలీ భార్య షేక్ యాస్మిన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కడప తాలూకా సీఐ వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అన్ని కోణాలలో కేసు దర్యాప్తు చేపట్టామన్నారు. ఈ కేసులో నలుగురు నిందితులను మంగళవారం రామరాజుపల్లె దగ్గర అరెస్టు చేసి, హత్య చేసేందుకు వారు ఉపయోగించిన రెండు కత్తులు, మూడు సెల్ ఫోన్లు, నేరం జరిగిన తర్వాత అక్కడి నుంచి పారిపోయేందుకు ఉపయోగించిన స్కూటీని స్వాధీనం చేసుకున్నామన్నారు. అతి తక్కువ సమయంలో హత్య కేసులో నలుగురు నిందితులను అత్యంత చాకచక్యంగా పట్టుకోవడంలో కృషి చేసిన కడప తాలూకా సీఐ జి. వెంకటేశ్వర్లు, ఎస్ఐలు తులసి నాగ ప్రసాద్ , తాయర్ హుస్సేన్, ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, హెడ్‌కానిస్టేబుళ్లు విద్యా సాగర్, నాగరాజు, కానిస్టేబుళ్లు సుబ్బయ్య, పుల్లయ్య, రఘు రాముడులను జిల్లా ఎస్పీ, కడప డీఎస్పీ వెంకటేశ్వర్లు అభినందించారు.